# మెఱుపులు: మాతృద్రోహం

- వేమూరి వేంకట రామనాథం

ఈ శీర్షిక నా కలం మొన నుండి జార్చేవేళ నాకు నిజంగా కన్నీరు వచ్చింది. మాతకు ద్రోహమా, అని. కాని అది నలుదిక్కులా జరుగుతున్నది. కనుక ఆదురదృష్టం గుఱించి వ్రాయ పూనుకున్నాను.

ఈ మాత అసాధారణ పుణ్యవతి. ఆమె వయసు ఎంతో సరిగా ఎవరెఱుగుదురు? వయసు ప్రసక్తి అక్కఱ లేకయే ఆమె నిత్యయౌవనవతి. ఏనాటికానాడు బొమ్మవలె సౌందర్యం చిప్పిలించే ప్రౌఢ. లెక్కలేనన్ని పిల్లలెందఱకు ఆమె తల్లియో మనకు దృఢంగా తెలియదు. ఆమె మన భూమాత.

ప్రకృతిలో ముఖ్యభాగముగా ఎన్ని అసంఖ్యాకమైన అర్బుదాలుగా ఆమె మనకు ఆధారంగా నిలిచి యుందో! జరిగిన కాల ప్రవాహంలో ఆమె బిడ్డలు ఎన్నెన్ని సత్కార్యాలతో పాటు చెడ్డపనులు కూడచేశారో! నరకాసురు డొక ప్రఖ్యాత పురుషుడు. అయితే ఇటీవలి కాలంలో మానవులు - ఆమె బిడ్డలు - ఆమెకే ఆపద కలిగే కార్య పరంపరలో ఉవ్విళ్ళూరుతున్నారు. ఇది కృతఘ్నతగాను, ద్రోహంగాను చమత్కరించి యీవ్యాసం వ్రాస్తున్నాను.

ఆమె బిడ్డలు - దాదాపు అందఱు మానవులు - రానురాను ఆమె ఓర్పునకు మించిన యిక్కట్లు కలుగచేస్తున్నారు. ఈ అకార్య సంఘటనలు వారి తెలివితక్కువతనం వల్లకాదు సంభవించేది; వారి విజ్ఞానం దినదినం అంచెలంచెలుగా వెజృంభిస్తూనే యుంది; కాని వారిలో భూమాతయెడ వలసిన ఆర్ద్రత మాత్రం ఇగిరి పోతున్నది. కారణం ప్రధానంగా స్వలాభచింతన. తమ యొక్క లేక తమ దేశం యొక్క వృద్ధి కొఱకు, ఆర్థిక ప్రయోజనం కొఱకు, తాము అవలంబించే అనేక విధానాలలో భూమికి ప్రకృతికి, వాతావరణానికి, జలచరములకు, పక్షి సమూహాలకు, జంతువులకు, ఇబ్బంది కలిగే పద్ధతులున్నాయి.

మనం మన ఉత్పత్తి విధానాల వల్ల, విద్యుత్తును సంభవం చేసే పద్ధతుల వల్ల ప్రకృతిలోకి విషవాయువులను నిరంతరం పంపుతున్నాము. అంచనాల ప్రకారం విద్యుచ్ఛక్తి అవసరాలు ఇండియాలో ఇరువది అయిదు సంవత్సరాలలో నాలుగు రెట్లు పెరుగుతాయి. ఒక దుష్ఫలితం: పైకి విజృంభించే విషవాయువుల పరిమాణం తప్పని సరిగా అత్యధికం అవుతుంది.

ఇలాంటి విషవాయువుల సంభవత్వంలో అందఱను మించిన తాంబూలం అమెరికాది! ఇండియాలో ఒక వ్యక్తి సగటున ఎంత విషవాయు సంభవత్వానికి కారకుడో, అంతకన్న 16 రెట్లుగా అమెరికన్లు (సగటున) అలాంటి వైపరీత్యానికి కారకులు అని లెక్కలు వేయబడుతున్నాయి.

ఈ విషవాయువుల కారకత్వం గుఱించిన కొన్ని విశిష్టమైన సాంఖ్య సూచనలు చూతాము. వాటిని వదలే దేశాలలో అగ్రస్థానం అమెరికాది; తరువాత చైనా, రష్యా, ఇండియా వస్తారు. ఇండియా యొక్క జనాభా కారణంగా తన సగటు "దుండగం" సాలీనా 1.2 టన్నులు; ప్రపంచంలో మొత్తం మీద సగటున 4 టన్నులు; అమెరికాలో మాత్రం 20 టన్నులు. పాతిక సంవత్సరాలలో ఇండియా యొక్క యీ సగటు రెట్టింపు అవుతుందని అంచనాలు వేయ బడుతున్నాయి, ఎందుకనగా ఇండియా యొక్క ఇంధనం అవసరాలు విపరీతంగా పెరుగుతున్నాయి, వివిధ శాఖలలో ఉత్పాదకత్వం విజృంభించుకు పోవటం వల్ల.

ఇండియాను గూర్చిన ఒక చిన్న ఉదాహరణ ఈ సమస్య యొక్క స్వరూపం కొంతగానైనా విశదీకరిస్తుంది. దేశంలో పెరిగిపోతున్న మోటారుకార్ల సంఖ్య, మోటారు సైకిళ్ళ సంఖ్య గమనిస్తే, హైదరాబాదు వంటి నగరాలలో వీటి వలన ప్రకృతి పరిసరాలకు (environment) కలుగుతున్న వివిధ - అపాయాలను మనం తేలికగా ఊహించవచ్చును. తార్నాకా నుండి సుల్తాన్ బజార్‌కు ఏ ఆటో మీదనో వెళ్ళి వస్తేసరి, ముక్కునుండి భరింపరాని ఉపద్రవము, కనులు ఎఱ్ఱబడటం, మనలో చాల మందికి స్వానుభవ రీత్యా విశదమేననుకుంటాను. ఈ దుస్థితికి మనం ఒడ్డున కూర్చుండి విచారించినా, కొందఱు దేశంలోని విధాన నిర్వాహకులు అంటారు, "ప్రపంచంలోని గ్రీన్ హౌస్ గ్యాసెస్ (greenhouse gases) లో మనవంతు 4.6% మాత్రమే, మన జనాభా ప్రపంచంలో 17 శాతం అయినా!" ఎంత సూక్ష్మబుద్ధిగల లెక్క యిది! మన జనాభా వంతుకు సరిసమానంగా మన దేశం ఆ విషవాయువులను వాతావరణంలోకి వదలితే, వాటి దుష్ఫలితం ఎవరికి? ఇప్పటికే హైదరాబాదు వంటి నగరంలో సుఖంగా బైట తిరగటం "శ్వాస" రీత్యా అసుఖప్రదంగా ఉన్నదే!

ప్రపంచంలో భూమికన్న కొన్ని రెట్లు విశాలమైన సముద్రాలలో ఈ శీతోష్ణస్థితి వైపరీత్యాలు స్పష్టమైన అరిష్టాలను కలిగించగలవన్న శాస్త్రజ్ఞుల జ్యోతిషం దినదినము స్పష్టమవుతున్నది. ప్రపంచపు సముద్రాలలో 40%గ, మనుష్యులు చేపలు పట్టటం మొదలయిన అమితమైన చేష్టలవల్ల, ముప్పులో పడినట్లు సూచనలు చెలరేగుతున్నాయి. ఈ విధంగా సముద్ర - రసాయన - పరిణామాల వల్ల "shell-forming plankton and reef- building species" దెబ్బ తింటాయని విజ్ఞులు భయపడుతున్నారు.

మధ్య ఆఫ్రికాలోని "వర్ష - అరణ్యాలలో" (rain forests) కలపకొట్టటం (logging) వలన మనం వెంటనే గమనించి దూర -

దుష్ఫలితం ఉన్నది. ఇప్పటికే అతి స్వల్పంగా ఉన్న "టర్టిల్" జాతులకు తీరని కీడు కలుగుతున్నది. గేబన్ ప్రాంత సముద్రతీరంలో ఇది స్పష్టంగా గోచరిస్తున్నది. ఎలాగా, విపరీతమైన కలప దులిపే పరిశ్రమలో ఎన్నో శాఖలు పడిపోయి వందల మైళ్ళుగా కాంగో నదిలో తేలిపోతూ చివరకు గల్ఫ్, ఆఫ్గినీ దగ్గఱ తీరప్రాంతమంతా కప్పుకు పోతున్నాయి. ఈ వైపరీత్యం మూలంగా అక్కడ ఏళ్ళతరబడి విశ్రమించి తమ సంఖ్యలను సహజ పరిస్థితులలో వృద్ధి చేసికొనే టర్టిల్సు మొదలయిన జీవాలకు అనూహ్యమైన ఇబ్బంది కలుగుతున్నది. ఇవి ఇప్పటికే క్షీణిస్తున్న జీవకోటికి చెందినవి. వాటి దుస్థితి యింకా దారుణం అవుతోంది, మానవుడు తన లాభానికోసం చేస్తున్న అమిత పరిశ్రమ వల్ల, మాతకు తాను చేసే ద్రోహం వల్ల!

ఇలాంటి దుష్ట వైపరీత్యాలను సరిదిద్దటం ప్రభుత్వాలు చేయవలసిన పనులలో ఒకటి. కాని అది అంత తేలికకాదు. చైనా వంటి విశిష్టశక్తివంతమైన దేశంలో ఒక చక్కని ఉదాహరణ లభ్యమయింది. వాతావరణకల్మషం వలన ఒక ముఖ్య నదీ ప్రాంతం చైనా మధ్యభాగంలో ఎఱ్ఱగా, నురుగు (foam) బీటవారుతున్నది. ఇది సరిదిద్దటానికి గాను సుమారు 2 లక్షలప్రజకు అక్కడి నీటి సరఫరా రద్దుచేశారు. ఇలాంటి బహిష్కరణ నిర్ణయం చైనా వంటి రాజకీయవ్యవస్థలో సాధ్యం కావచ్చునుగాని, సాధారణంగా ప్రజాస్వామ్య పరిస్థితులకు లోనైన మిగిర యెన్నో దేశాలలో అది అంత సులభం కాదు. ప్రతిప్రాంత ప్రభుత్వంలోను అయిదారు రాజకీయపక్షాల మద్దతు కావలసిన సమయంలో ప్రభుత్వరథం నడిపేవారికి అలాంటి గట్టి స్పష్ట నిర్ణయం దాదాపు అసంభవంగా తోస్తుంది. తిరిగి చైనాను గుఱించి గమనించుదాం. డాంగ్ జింగ్ నదిలో లోహం కడిగే పరిశ్రమల వలన అమోనియా, నైట్రోజిన్, ఇతర రసాయనములు మితిమీరి, చైనాకు "ప్రకృతి" (environmental) సమస్యలు దుర్భరంకా జొచ్చినాయి. దేశంలోని నదులలో చాలభాగం "త్రాగేనీరు" కల్గియుండవు సరిగదా, అవిత్రాగితే వ్యాధులు కలిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందువలన చైనా ప్రభుత్వం వారు నీటిని అశుభ్రపఱచే సంస్థల యజమానులను, పాలకులను గట్టి పన్నులకు లోను జేశారు.

ఇంత ధైర్యంగా కఠినంగా ప్రజాస్వామ్యమని గర్వపడే అనేక దేశాల ప్రభుత్వాలు విధానాలను రూపొందించగలవా? అంతవఱకు ఎందుకు, అమెరికాకు ప్రకృతి కాలుష్యంలో అగ్రస్థానం ఉన్నా, అది మాపటానికి కావలసిన విధానాలను రూపొందించటంలో ప్రభుత్వం ఎంత వెనుకంజ వేస్తున్నదో మనకు విదితమే గదా. తమ పరిశ్రమల సౌభాగ్యంకోసం, తమ లాభాలకోసం తమ దేశాదాయం ఇనుమడించటం కోసం, ఇలాంటి కఠినమైన ఆంక్షలను విధించటానికి ప్రభుత్వం వెనుకాడుతున్నట్లు మనం గమనిస్తూనే ఉన్నాము గదా.

ఈ సందర్భంలో ఇండియాలో ఒక ప్రసిద్ధ ప్రభుత్వ - అధిపతి వెలిబుచ్చిన అభిప్రాయం ఒకటి గమనించుదాం. "కాలుష్యం గుఱించి వ్యక్తి యొక్కొక్కరికి ఎంత" అన్న లెక్కను వదలి, మొత్తం మీద అది యెక్కువ అని విమర్శించటం సవ్యం కాదు" అని మన దేశంలో జనాభా ఎక్కువ కనుక వ్యక్తి వంతున అది తక్కువయే గదా అని దీని భావం. ఈసమర్ధనలోని సారస్యం గమనించండి: మన జనాభా ఇంకా బాగా పెరిగితే, మనం ప్రకృతిలోనికి చిమ్మే కాలుష్యం కూడా హెచ్చినా ఫరవాలేదు!! ఈ కాలుష్యం అన్నది సాంఖ్య వాదానికా, లేక మానవ జీవన సౌభాగ్యం దృష్టికా, ముఖ్యం? చూడండి యీ విచిత్రం, ఒక ప్రక్క జనాభా పెరుగుతుంది, మరొక రక్క కాలుష్యం పెరుగుతుంది! మనధ్యేయం కాలుష్యం తగ్గవలెనని కాని, వ్యక్తికి ..... "చొప్పున" ఎంత అన్న లెక్కకాదు. దీని ఫలితం మనకే అశ్రేయస్సు!

కాని అది తగ్గించటానికి కావలసిన ప్రభుత్వ కార్యక్రమాలు సత్వరం సాధ్యం కావలెనంటే, మన నేతలలోను, మంత్రివర్గాలలోను క్రొత్త చూపు అవసరం. ఈ కార్యక్రమాల వలన తక్షణ ప్రయోజనం దక్కే ఆకర్షణలేదు, పైగా కొన్ని కొన్ని ఉత్పాదకవిధానాలకు ఏకొంతగానో అంకుశం వేయవలసి ఉంటుంది; వెంటనే కలిగే లాభం కొంతగా తగ్గుతుంది; పైగా క్రొత్త ఉత్పాదన పద్ధతుల కోసం కొంత అదనపు వ్యయం ఉండవచ్చు. ప్రభుత్వం గట్టి శాసనం ప్రవేశబెట్టి అది నిక్కచ్చిగా అమలు చేస్తే తప్ప, నూతన ఉత్పాదన విధానాలను ప్రజల స్వంత నిశ్చయాలకు మాత్రం వదలితే, ఘనమైన విజయం కలుగదు.

ప్రభుత్వాలు ఈ మంచిమార్పుల కోసం ఎందుకు ప్రయత్నించవు, అన్నదొక సవ్యమైన ప్రశ్నయే. సమాధానం అంత కష్టమయినది కాదు. వలసిన మార్పుల వలన ఉత్పాదన వ్యయములు కొంతగా ఎక్కువ కావచ్చును; ప్రస్తుతం ప్రజలకు గల అలవాట్లలో మార్పులు రావలసి యుండవచ్చును. ఉదాహరణకు పట్టణములోని గుబురు ప్రాంతాలలోకి మోటారు కార్లు వస్తే వాటికి ప్రత్యేకంగా సుంకం వేయవలసియుంటుంది. ఈ పద్ధతి ఎందఱకు సమ్మత మవుతుంది? ప్రతి అంగడిదారు ఒక చిన్న డిసెల్ ఇంజన్ నడుపుతూ ధ్వని, దుర్వాసన కలిగిస్తున్న రోజులలో అలాంటి యంత్రం బహిష్కరించ వలెనని ప్రయత్నిస్తే, నాలుగు రోజులలో అందఱు కలిసి, ప్రభుత్వ నాయకులనే బహిష్కరింప ప్రయత్నిస్తారు.

వాతావరణ కాలుష్యం పరిమార్చవలెనంటె ముఖ్యంగా కావలసినది సాంఘిక సమ్మతి, అది కార్యరూపేణ చిత్రించగల ప్రభుత్వ కార్యక్రమం. దీనికి తగిన ధైర్యం గల మంత్రివర్గాలు ఎన్ని ఉంటాయి? ఇతర దేశాలతో ఆర్థికంగా పోటీలో ఉన్న పారిశ్రామికులు తమ ఉత్పాదన వ్యయాలు తగ్గించుకోవలెనని చూస్తారు. ప్రభుత్వాలు కూడ తమ దేశసమగ్ర - ఉత్పాదనలో సంపదలో, వృద్ధిలో విదేశవ్యాపారంలో -

ఎగుమతులలో - మెఱుగుదల కోరుకుంటాయి;  ఈ పరిసరముల సమస్య నేడు కాదులే రేపు చూచుకొన వచ్చును, అన్న కుతర్కానికి పాల్గొంటాయి. ఈ విధమైన నిర్లక్ష్యం వల్ల ఫలితంగా క్రమక్రమంగా మనం నివసించే పరిసరాలకు, మన చుట్టుఉన్న ప్రకృతి సామంజస్యానికి, తీరని నష్టం కలుగుతుంది.  ఇదే ఈ నాటి ప్రజ భూదేవికి చేస్తున్న మాతృద్రోహం.

దీనికి ఆ విశాల హృదయమైన మాతకు కలిగే గాటు వలన, పరిపరి విధాల మనం బాధలకు గురి అవుతాం: అనారోగ్యం ఒక ప్రధాన ఫలితం. తోడి జీవాలు కొన్ని, పక్షిలోకం లోవి, జలచరములలో నివి, - క్రమంగా నీరసించి, సంఖ్యలు తగ్గిపోతాయి. అనగా దైవసృష్టి సర్వస్వాన్ని మనం ధిక్కరిస్తున్నామన్న మాట. మన తరం వారు కలిగించే ప్రకృతి కాలుష్యం వలన మనలో కొందఱు ధనార్జనలో పెంపు పొంద వచ్చు, కాని ఎందరో కార్మికశ్రేణిలోని జనం, గృహంసౌకర్యాలు నీరసస్థితిలో ఉన్న బీదజనులు, నేడే కష్టాలు అనుభవిస్తారు.  మొత్తం మీద అందరకు ఆరోగ్యంసంపద నీరసిస్తుంది.  క్రమంగా మన పిల్లలు, మునిమనుమలు, మనతరం వారు చేస్తున్న మాతృద్రోహం యొక్క దుష్ఫలితాలెన్నో రీతులలో అనుభవిస్తారు.

ప్రకృతి కెదురుగా మానవుడు చేస్తున్న దుశ్చర్యలకు, వాటి చెడు ఫలితాలకు గల ఎన్నో ఉదాహరణలలో ఒకటి యిక్కడ నివేదిస్తాను. కలప వ్యాపారులు మెక్సికో మధ్యప్రాంతంలోని అరణ్యాలలో చెట్లను నఱికి వేయటంతో అక్కడ ప్రతి యేడు వలస వచ్చే శీతాకోక చిలుకలకు ఇబ్బంది కలిగి ఆ ప్రాంతానికి వాటి రాక తగ్గిపోతుంది. వేల సంవత్సరాలుగా వాటికి చలికాలపు విహారస్థలంగా ప్రఖ్యాతి పొందిన ఆ ప్రదేశంలో వాటిరాక నీరసిస్తోంది.  ఇది గమనించి 2000 లో ఆ దేశ - అధ్యక్షుడు ఒక హుకుం ఇచ్చాడు, కాని దానికి వ్యతిరేకంగా కూడ ఈ వ్యాపారులు తమ దుండగం సాగిస్తూనే ఉన్నరు.  నోరు లేని భృంగలకు ఎంత అపరాధం! వాటిని కన్న తల్లికి -భూమాతకు - ఎంత ద్రోహం!

ప్రపంచ క్షేమం దృష్ట్యా మనం గమనించవలసిన మఱొక అంశం వివరిస్తాను.  అమెరికా గ్రీన్ హౌస్ విషవాయువులను ఎంతో దారుణంగా చాల యేండ్లుగా వదులుతూ ఉన్నా,  మొన్న నీ మధ్యనే వీటి వలన ప్రజారోగ్యానికి, సౌఖ్యానికి అపాయం కలుగుతుందని ప్రభుత్వం వారు ఒప్పుదల సూచించారు. ఎన్‌వైరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ వారు శీతోష్ణవ్యవస్థ వేడిమికిలో నవటం నిర్ద్వంద విషయం అని కూడ ప్రకటించారు.  మానవులు వదలే యీ మలినముల వలన విపరీతమైన అగ్నిప్రమాదాలు, వానలు లేని వ్యవసాయ - అరిష్టాలు, సముద్ర మట్టం పైకి హెచ్చుటం, బ్రహ్మాండమైన ఉప్పెనలు, క్రిములు ఒనగూర్చే అస్వస్థతల పెంపు - మొదలయిన కీళ్ళు సంక్రమించటం తథ్యం అని ప్రకటించారు. అయితే తగిన నివారణోపాయాలేమీ ప్రకటించలేదు. కాలిఫోర్నియా వంటి స్టేట్సు తమంతట తాము తగు చర్యలు తీసికోవలెనని ఉత్సాహపడుతున్నాయి గాని, దేశప్రభుత్వం వెనుకాడటంతో అలాంటి సత్ - చర్యలకు ఇంకా ఆరంభ - అదృష్టం కల్గలేదు - (న్యూయార్కు టైమ్స్, మార్చి 2008 సంపాదకీయం చూడండి). భూగోళపు వేడిమి పెరిగిన కొలది సముద్రములు పొంగి పొరలటం ఒక దుష్ఫలితం. యునైటెడ్ నేషన్సు వారి ఇంటర్ - గవర్నమెంటల్ పానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ ( Inter- Governmental Panel on Climate Change) తమ అభిప్రాయ మొకటి యిలా వ్యక్తం చేశారు:  2100 సంవత్సరానికి సముద్రం లెవెల్ లో రెండు అడుగుల ఎత్తు పెరుగుదల ఉంటుంది,  సౌత్ ఫ్లోరిడా వంటి ప్రదేశాలలో జీవనం చాల కష్టభూయిష్ఠంగా ఉంటుంది.”  ఇటీవల అమెరికాలో వివిధ సంస్థలు ప్రచురించిన సంయుక్త నివేదిక ప్రకారం, ఇలాంటి సముద్ర విజృంభణ వలన 2200 మైళ్ళ ముఖ్యమైన రోడ్లు, 900 మైళ్ళు రైల్వే మార్గములు - మేరీలాండు, వర్జీనియా, నార్తు కారొలీనా, డిస్ట్రిక్టు  ఆఫ్ కొలంబియాలో - తఱచుగా మునిగిపోవటం తటస్థిస్తుంది.  వారి సూచనలో ఒక ప్రధాన విషయమేమంటే, ప్రభుత్వ సంస్థలు తమ యోజనలో శీతోష్ణస్థితి పరిణామాలను ప్రత్యేకంగా గమనించ వలసి యుంటుంది, అని. ఇలాంటి యిటీవలి ప్రముఖ నివేదికలలో స్ఫుటంగా గోచరించేది యేమంటే, ఇంత వఱకు శీతోష్ణస్థితిలోని మార్పులను గుఱించి మనం అతిస్వల్పంగా గమనించాము; రానున్న దుష్ఫలితాలు అతి దారుణంగా ఉండగలవు, అని.

మానవులు ప్రకృతిలోనికి  జొనిపే కాలుష్యం వలన కలుగనున్న దుష్ఫలితాలను గుఱించిన నిపుణ నివేదికలు ఎన్నో వస్తున్నాయి. ఉ: అమెరికా - కెనడాల "గ్రేట్ లేక్సు ప్రదేశంలో"  ఈకాలుష్యం వలన శిశుమృత్యువులు, బ్రెస్టుకాన్సర్ మొదలయిన దుస్థితులు కలుగునని యిటీవలన ఒకని నివేదిక ప్రతిపాదించింది.

ముగింపులో, ఇండియాకు సంబంధించిన ఒక విషయం పేర్కొంటాను.  మనదేశంలో ముప్పది నలుబది యేండ్ల వెనుక, "ఆహా, ఈ పట్టణం ఎంత చక్కగా, మంచి గాలికి ఇరవుగా, ప్రకృతి సౌందర్యానికి చిహ్నంగా, ఉంది” అని ఉబలాట పడినామో, నేడు ఆపట్టణమే ఎలా ఉన్నదో ఎవరికి వారు గుండె మీద చేయివేసికొని ఆలోచించండి. "ఫలానా" పట్టణం అని పేరు చెప్పను.  ఉదాహరణలకు వెదకితే అతి సులభంగా దొరుకుతాయి.  ఈ దిగజారుడే మనం చేస్తున్న మాతృద్రోహానికి దర్పణం! ఫలితం ప్రజానీకానికి అనారోగ్యం, బ్రతుకు తెఱువులో కష్టం. జాగ్రత్తగా ఆలోచిస్తే ఇది మనం భూమాతకు చేసే ద్రోహానికి అదృశ్యదర్పణం!

****